క్లుప్తంగా

ఆసిఫాబాద్‌కు చేరిన ప్రచార రథాలు



కలెక్టరేట్‌కు చేరుకున్న ప్రచార రథాలు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం ×మా సంకల్పం అభివృద్ధి చెందిన భారతదేశం×అనే నినాదంతో దేశవ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాలు జిల్లాకేంద్రానికి చేరుకున్నాయి. గురువారం నాలుగు ప్రచార రథాలు చేరుకోగా, సుమారు రెండు నెలల పాటు ప్రతీ జీపీల్లో ముఖ్య కూడళ్ల వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 10కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 4 కోట్ల పక్కా ఇళ్ల నిర్మాణం, 11 కోట్ల మందికి పైగా రైతులకు ఇప్పటి వరకు రూ.2.6 లక్షల కోట్ల ఆర్థికసాయం, 135 కోట్లకు పైగా కుళాయి కనెక్షన్లు, మరిన్ని పథకాల అమలుపై గ్రామాల్లో అవగాహన కల్పించనున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే కోవలక్ష్మిని సన్మానిస్తున్న డీడీఎన్ అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోవలక్ష్మిని గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో దూపదీప నైవేద్యం అర్చక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మిని వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ, జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస శర్మ, సభ్యులు తిరుపతిచారి, విజయ్‌కుమార్, రాంచందర్, ప్రశాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

కౌటాల: మండలంలోని గురుడుపేట్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఎల్కుచ్చుల పోశన్న ఇంట్లో 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకుని అతనిపై కేసు నమోదు చేశామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై సందీప్ కుమార్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ ఉన్నారు.

వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్, అంటు వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. టీబీ, కుష్టు, అంటువ్యాధులు, దోమల నివారణ, ఆరోగ్యం, విద్య వంటి పలు అంశాల గురించి వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, హెచ్‌ఏ భగవాన్ దాస్, ఆశ వర్కర్ సారిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీజీబీ రెబ్బెన శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫైనాన్స్ లిటరసీ కౌన్సిలర్ (ఎఫ్‌ఎల్‌సీ) ప్రేంరావు బ్యాంకు ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలు, రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు మ్యాజిక్ షో, పాటలు, మాటల ద్వారా ప్రజలను అర్థమయ్యే రీతిలో బ్యాంకు పథకాలను వివరించారు. ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు, ఫీల్డ్ ఆఫీసర్ దుగ్యాల సునీత, గోగికార్ నరేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు లేక ఇబ్బందులు

- బాబేఝరి గ్రామంలో దుస్థితి
- పెంకుటిళ్లు, రేకుల ఇళ్లలో జీవనం
- ఆదివాసీల ఇక్కట్లు
- వర్షం కురిస్తే ఇళ్లన్నీ చెరువులు



బాబేఝరి గ్రామం

కెరమెరి: మండలంలోని బాబేఝరి గ్రామంలో పక్కా ఇళ్లు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా పెంకుటిళ్లు, పాతబడిన రేకుల ఇళ్లల్లో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలు కురిస్తే ఇళ్లు చెరువులుగా మారనుండడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాలకులు మారుతున్నా తమకు పక్కా ఇళ్లు నిర్మించలేదని పేర్కొంటున్నారు. ఉండేందుకు సరైన ఇళ్లు లేక నరకయాతన పడుతున్నారు. కొందరికి గూన ఇల్లు ఉంటే మరికొందరికి రేకుల ఇళ్లు ఉన్నాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు కొందరి గోడలు కూలిపోయాయి. గోడల స్థానంలో తడకలు చుట్టి కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు పాత రేకులను గోడలుగా చుట్టి నివాసముంటున్నారు. మండలంలోని బాబేఝరి గ్రామంలో 25 కుటుంబాలు, 125 మంది జనాభా ఉంది. అక్కడ ఒక్కటి పక్కా ఇళ్లు లేకపోవడం గమనార్హం.

వాన కురిస్తే చెరువులే..

వర్షాకాలంలో ఇళ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. ఇళ్ల పై భాగంలో గుట్టలు ఉండడం వల్ల కురిసిన వర్షం మొత్తం వారి ఇళ్లలోనే చేరుకుంటున్నాయి. దీంతో ఇంటి వస్తువులతోపాటు, ఆహార ధాన్యాలు తడిసి ముద్దయిన సందర్భాలు లేకపోలేదు. ప్రతి ఏడాది అధికారులకు సమస్యలు విన్నవిస్తున్నప్పటికి పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం ప్రకటన వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు ఇవ్వనప్పటికి నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.



గోడ కూలడంతో కట్టిన తడక

ప్రభుత్వంపై నమ్మకం ఉంది



ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు వచ్చినప్పటికి మా జీవితంలో ఎలాంటి మార్పు లేదు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం ఇస్తారని ఆశపడినా చివరికి నిరాశే మిగిలింది. నూతన సీఎం రేవంత్‌రెడ్డిపై ఆశలు పెట్టుకున్నాం.

– మూట ఎల్లయ్య, బాబేఝరి

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీపీ విమలాబాయి

వాంకిడి: మండలంలోని కనర్‌గాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎంపీపీ ముండె విమలాబాయి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీపీ నిధుల నుంచి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీఆర్‌ఎస్ నాయకుడు దీపక్ ముండె, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



శ్రీపాల్‌రెడ్డి

కౌటాల: కౌటాల తహసీల్దార్‌గా శ్రీపాల్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. ఇక్కడ పనిచేసిన కిరణ్‌కుమార్ బదిలీపై కాగజ్‌నగర్‌కు వెళ్లారు. కాగజ్‌నగర్ నుంచి శ్రీపాల్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతల అనంతరం శ్రీపాల్‌రెడ్డిని రెవెన్యూ సిబ్బంది సన్మానించారు.

బీజేపీ సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

బెజ్జూర్: అసెంబ్లీలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు గురువారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. రాజారాం, బాపు, జలపతి, తిరుపతి, విట్టయ్య, రామన్న, రమేశ్, తిరుపతి, రాజు, వసంత్, కార్తీక్, జంగిటి, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే

నెన్నెల: మండలంలోని గన్‌పూర్, నెన్నెల గ్రామాల్లో గురువారం బడి బయటి పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. మధ్యలో చదువు మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలనే లక్ష్యంతో సర్వే చేపడుతున్నామని ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు, 15 నుంచి 19సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు బడి బయటి విద్యార్థులను గుర్తిస్తున్నామన్నారు. సర్వేలో నోడల్ అధికారి ప్రకాష్‌రావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్: జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఎన్నికైన సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు పట్టణంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ చైర్మన్‌గా కోనేరు కృష్ణారావు బాధ్యతలు స్వీకరించి పట్టణానికి వచ్చిన సందర్భంగా కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. స్థానిక చెక్‌పోస్టు నుంచి ప్రధాన వీధుల గుండా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసం వరకు ఈ ర్యాలీ సాగింది. స్థానిక పెట్రోల్ పంప్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జెడ్పీ చైర్మన్ పులమాల వేసి నినాదాలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కౌన్సిలర్లు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్ధిక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనేరు కృష్ణారావుకు సన్మానం



మిఠాయి తినిపిస్తున్న జెడ్పీటీసీ పుష్పలత

బెజ్జూర్: జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోనేరు కృష్ణారావును బీఆర్‌ఎస్ నాయకులు గురువారం సన్మానించారు. జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్, మాజీ చైర్మన్ డోకే వెంకన్న, నాయకులు జాహిద్ హుస్సేన్, జావిద్, పుల్లూరి సతీశ్‌కుమార్, నాహీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమెప్పుడో?

- పంట చేతికొచ్చినా ఏర్పాటుచేయని వైనం
- ఇబ్బంది పడుతున్న రైతులు



ఖర్జెల్లి వద్ద ధాన్యాన్ని ట్రాక్టర్‌లో చేరుస్తున్న రైతు

చింతలమానెపల్లి: మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ ఏడాది చింతలమానెపల్లి, రవీంద్రనగర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ధాన్యం చేతికి వచ్చినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆలస్యమైన కొనుగోళ్లు

గతేడాది మండలంలో రవీంద్రనగర్, చింతలమానెపల్లిలో గతనెల 30న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం రవీంద్రనగర్ కేంద్రంలో 1400 మెట్రిక్ టన్నులు, చింతలమానెపల్లిలో 1050 మెట్రిక్ టన్నుల ధాన్యం సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. కాగా ఈ ఏడాది ఎన్నికల కారణంగా జాప్యం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ లేదా పౌర సరఫరాల శాఖకు సరఫరా చేయడానికి ఒప్పందం కుదరకపోవడంతో కేంద్రాల జాప్యానికి కారణమని పేర్కొంటున్నారు.

గోదాం లేకనే..

చేతికి వచ్చిన పంటను నిల్వ చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో గోదాం లేక దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను ఇంటి వద్దకు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తరలించినా రవాణా ఛార్జీలు రెట్టింపవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యం రూ.2202, గ్రేడ్ బీ రకం రూ.2182ల ధర చెల్లిస్తోంది. ఈ ధాన్యం సంబంధిత వ్యవసాయ అధికారి ధ్రువీకరణ అనంతరం కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. ఈ వ్యవహారానికి మరింత జాప్యం జరుగుతుందని, అంతవరకు ధాన్యం నిల్వ ఉంచడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మండలంలో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు గురుడుపేట సహకార సంఘం అధికారి రాజు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం గన్నీ బ్యాగులను ఇప్పటికే సరఫరా చేసిందని వివరించారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం



చంద్రశేఖర్

దహెగాం: ఈనెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లి గూడెంలో బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో 30 గంటల పాటు ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు నోముల చంద్రశేఖర్‌కు గురువారం ఆహ్వానం అందింది. కళా ఉత్సవాల్లో పాల్గొంటానని ఆయన తెలిపారు.

నేడు, రేపు కాంప్లెక్స్ సమావేశాలు

కెరమెరి: మండలంలోని ఝరి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో శుక్ర, శనివారాల్లో అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆడే ప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు ఉదయం 9.30 గంటలకు హాజరై ఆర్పీలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేయాలని కోరారు.

కుమారుడి మృతికి కారకులపై చర్య తీసుకోవాలి

వాంకిడి: తన కుమారుడి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి ఆదె శంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన ఆదె గోపాల్ ఈనెల 10న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం శంకర్ విలేకరులతో మాట్లాడారు. కుమారుడి ఆత్మహత్య చేసుకునేలా చేసిన మామ, భార్య, ఇద్దరు బావమరిదిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఫిర్యాదు ఇచ్చి మూడు రోజులైన చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం'

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్‌గా కోనేరు కృష్ణారావును నియమించడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు సప్ప శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ కాగా, ఇంతవరకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగిన కోవ లక్ష్మి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించి, ఎస్టీ మహిళను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన సామాజిక తనిఖీ

జైనూర్: గ్రామ పంచాయతీల వారీగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ గురువారంతో ముగిసింది. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఆర్పీలు, సామాజిక తనిఖీ బృందం గ్రామస్తులకు గ్రామసభ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో నగేశ్ తెలిపారు. ఈవో అల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ పార్వతీ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగాపూర్: మండలంలో 14 పంచాయతీల్లో ఉపాధి పనుల్లో భాగంగా చేపట్టిన పనులపై ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మార్చి 2022–23 సంవత్సరం వరకు రూ.3 కోట్ల 4 లక్షల ఖర్చుతో వివిధ పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీలో చేపట్టిన పనుల్లో అవకతవకలను గుర్తించారు. డీఆర్‌డీవో సురేందర్ మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పనుల్లో తేడాలు కనిపించడంతో నిర్లక్ష్యం వహించిన వారికి జరిమానాతోపాటు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో జె.ల్.ప్రసాద్, ఏపీవో రామక్రిష్ణ, వైస్ ఎంపీపీ ఆత్మారాం, సర్పంచ్ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



రెబ్బెన: మండలంలో గత రెండు రోజులుగా చలి వణికిస్తోంది. గురువారం ఉదయం 9 దాటినా ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు . చలి నుంచి రక్షణ పొందేందుకు కొందరు స్వెటర్లు, ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. మరికొందరు చలిమంటలు కాగుతున్నారు.





నేడు ఆత్మీయ సమ్మేళనం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు దూపదీప నైవేద్యం పథకం కింద జిల్లాలో పనిచేస్తున్న అర్చకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీడీఎన్ జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధికార ప్రతినిధి గంగు సత్యనారాయణశర్మ హాజరవుతారని పేర్కొన్నారు. అర్చకుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అర్చకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

బెల్లంపల్లి: సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐపీఈయూజీడీఎస్)ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లిలోని పోస్టాఫీస్ ఎదుట గ్రామీణ డాక్ సేవకులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలను చెల్లిస్తూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగులతో వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న ప్రతీ స్కీమ్‌కు తపాలాశాఖను భాగస్వామ్యం చేసి పనిభారాన్ని పెంచుతోందని తెలిపారు. గ్రామీణ డాక్ సేవకులకు క్యాష్‌లెస్ వైద్య సదుపాయం కల్పించాలని, రూ.5లక్షల గ్రాట్యూటీ పెంచడంతో పాటు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు రెండో పే స్కేల్ ద్వారా వేతనాలు అందించాలన్నారు. ఆర్ఐసీటీ మిషన్లకు బదులు లాప్‌ట్యాప్‌లు, ప్రింటర్లు అందజేసి సబ్‌స్టిట్యూట్‌లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు, సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అంతవరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, రామారావు, సభ్యులు విజయ్, రామకృష్ణ, శంకర్, అరుణ్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో దొనబండ పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట అఖిల భారత తపాలా ఉద్యోగుల(జీడీఎస్) సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం హాజీపూర్‌లోని పోస్టల్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్ హోదా వెంటనే కల్పించాలని, సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రాట్యూటీ రూ.5లక్షలు ఇవ్వాలని, క్యాష్ లెస్ మెడికల్ సౌకర్యం కల్పించాలని సమ్మెలో భాగంగా డిమాండ్ చేశారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ మృతిచెందగా ఆయన భార్య లలితకు మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును గురువారం అందించినట్లు టీజీబీ మేనేజర్ విశ్వనాథం తెలిపారు. బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమాను శ్రీనివాస్ చెల్లించాడు. ఆయన మృతిచెందడంతో భార్యకు బీమా చెక్కును అందజేశారు. బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.